# రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 'సదరం' శిబిరాలు..

- వైద్య అధికారులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫిబ్రవరి మరియు మార్చి (2026) నెలలకు సంబంధించి 'సదరం' శిబిరాల నిర్వహణ తేదీలను వైద్య అధికారులు ఖరారు చేశారు. వివిధ రకాల వైకల్యాలు కలిగిన వారి కోసం ప్రత్యేక విభాగాల వారీగా ఈ క్యాంపులు నిర్వహించబడతాయి.

సంబంధిత మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు), సిరిసిల్ల మరియు వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఈ సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని కోరడమైనది.

| క్రమ సంఖ్య | క్యాంపు తేదీ | విభాగము |
|---|---|---|
| 1 | 26.02.2026 (గురువారం) | కంటిచూపు -- 22 |
| 2 | 05.03.2026 (గురువారం) | వినికిడి -- 32 |
| 3 | 05.03.2026 (గురువారం) | జనరల్ -- 02 |
| 4 | 10.03.2026 (మంగళవారం) | మానసిక వైకల్యం -- 20 |
| 5 | 12.03.2026 (గురువారం) | ఆర్థోపెడిక్ -- 35 |
| 6 | 13.03.2026 (శుక్రవారం) | ఆర్థోపెడిక్ -- 35 |
| 7 | 16.03.2026 (సోమవారం) | ఆర్థోపెడిక్ -- 35 |

పైన తెలిపిన తేదిలలో సదరం శిబిరంకు హాజరగు దివ్యాంగులు సంబందిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్ --రే మరియు ఖణక్ష్మీణ అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకుని ఉదయం 09.00 గంటలకు సదరం శిబిరంకు హాజరు కాగలరని తెలియజేయుచున్నాము.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 27 ఫిర్యాదులు స్వీకరణ
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 27 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు పెంచాలి

- పలు జర్నలిస్టు సంఘాల డిమాండ్
- ఐ అండ్ పీఆర్ కమిషనరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా



**బలగం టీవి, హైదరాబాద్**

డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జ్యోతిబాసు, మస్తాన్ ఆందోళన వ్యక్తం చేశారు. డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించడంపై తీవ్ర ఆందోళన చెందుతున్నామని తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని ఐ అండ్ పీఆర్ ఆఫీసు ముందు డీజేఎఫ్ టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఐ అండ్ పీఆర్ అధికారి జగన్‌కు వినతిపత్రం అందించారు. కాగా, ఈ ధర్నాకు టీడబ్ల్యూజేఎఫ్, టీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజే (143), హెచ్‌యూజే మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా జ్యోతిబసు, మస్తాన్ మాట్లాడుతూ... గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు, కేవలం ఎడిషన్ సెంటర్ కు నాలుగు అక్రిడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడం దారుణమన్నారు. ఈ నిబంధనతో చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డులకు దూరం అవుతున్నారని తెలిపారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్కులు వేరువేరుగా ఉంటాయని, ప్రతి జిల్లాకు ఒక ఇన్చార్జితో పాటు సలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారని చెప్పారు. ఒక్కో ఎడిషన్లో మూడు నుంచి ఆరు జిల్లాలున్నాయని వాటికి అనుగుణంగా అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్చార్జిలకు కూడా అక్రిడిటేషన్లు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. హైదరాబాద్ సిటీకి కూడా ఆరు కార్డులే ఇస్తున్నారని, ఇక్కడ కనీసం17 నుంచి 18 మంది పని చేస్తున్నారని చెప్పారు. పైగా ఇప్పుడు హైదరాబాద్ మూడు కమిషరేట్లుగా మారడంతో పేజీలు కూడా పెరుగుతున్నాయన్నారు. దీంతో డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లను 12 నుంచి 8కి తగ్గించారని చెప్పారు. వారికి కూడా15 కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీజేఎఫ్ టీఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించినట్లు తెలిపారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ, అక్రెడిటేషన్ల మంజూరు విషయంలో వివక్ష తగదన్నారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల అక్రెడిటేషన్ల విషయంలో బయట వ్యక్తుల ప్రమేయంతోనే గందరగోళ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, కోశాధికారి యోగి మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్డుల కోసం జర్నలిస్టులు రోడ్ల పైకి వచ్చే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రెడిటేషన్ల విషయంలో అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలనీ, లేకుంటే జర్నలిస్టు సంఘాలను కలుపుకొని సచివాలయ ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు వెనకాడమని స్పష్టం చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి గండ్ర నవీన్ మాట్లాడుతూ, డీజేఎఫ్‌టీ సంఘానికి మొదట నుంచి హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ అండగా ఉన్నదని చెప్పారు. డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డీజేఎఫ్‌టీ చేసే భవిష్యత్తు పోరాటాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనర్హులను ఏరివేయండి, సహకరిస్తాం.. కానీ, అర్హత కలిగిన ఒక్క జర్నలిస్టుకైనా అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. హెచ్‌యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీజేఎఫ్‌టీ రాష్ట్ర నాయకురాలు విజయ మాట్లాడుతూ డెస్క్ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టీ డబ్ల్యూజేఎఫ్ కారదర్శి దామోదర్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ ఇన్చార్జి నవీన్ కుమార్ యారా, డీజేఎఫ్‌టీ నాయకులు లలిత, నిస్సార్, దొడ్డి శేఖర్, ఓగోటి కిరణ్ కుమార్, హెచ్ యూజే కార్యదర్శి జగదీష్, డెస్క్ జర్నలిస్టులు వినోద్ రావు, మనీష్, శంకర్, బిక్షమయ్య, మధుబాబు, రమేష్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో కలకలం..
## శ్రీవారి క్యూలైన్‌లో భక్తురాలిని కాటేసిన పాము!

**బలగం టీవీ, తిరుమల:**



కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న ఓ భక్తురాలికి చేదు అనుభవం ఎదురైంది. తిరుమలలోని రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్‌లో అనూహ్యంగా ఓ పాము ప్రత్యక్షమై భక్తురాలిని కాటేసింది.

తెలంగాణకు చెందిన మౌనిక (27) అనే భక్తురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం కోసం రూ. 300 క్యూలైన్‌లో నిలబడ్డారు. ఆ సమయంలో ఒక్కసారిగా వచ్చిన పాము ఆమె కాలుపై కాటు వేసింది. దీంతో భయాందోళనకు గురైన మౌనిక కేకలు వేయడంతో తోటి భక్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన టీటీడీ సిబ్బంది బాధితురాలిని ప్రథమ చికిత్స నిమిత్తం తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం, మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు ఆమెను వెంటనే తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.



# బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్ ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ.

- రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా.వి. రవీందర్ రెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

2026-2027 విద్యా సంవత్సరమునకు గాను బెస్ట్ అవైలేబుల్ స్కూల్ (రెసిడెన్షియల్ ఢ నాన్ రెసిడెన్షియల్) పథకములో భాగంగా, ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రవేటు ఇ /మీ పాఠశాలల నుండి దరఖాస్తుల ఆహ్వానించడం జరుగుచున్నది. ఇందుకుగాను బెస్ట్ అవైలేబుల్ స్కూల్ (రెసిడెన్షియల్) పథకములోని విద్యార్థులకు ట్యుషన్, హాస్టల్ వసతి, భోజన వసతికి గాను సంవత్సరం నకు గాను ప్రతి విద్యార్థికి రూ.42,000/- చొప్పున మరియు బెస్ట్ అవైలేబుల్ స్కూల్ (నాన్ -రెసిడెన్షియల్) పథకములోని విద్యార్థులకు ట్యూషన్ ఫీజుగా ప్రతి విద్యార్థికి రూ.28,000/- చొప్పున చెల్లించబడును. ఇందుకుగాను 7వ తరగతిలో మరియు 10వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత అందులో 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. దరఖాస్తుల ఫారములను పొందుట కొరకు 'సమీకృత జిల్లా సముదాయాల కార్యాలయము రాజన్న సిరిసిల్ల లోని మొదటి అంతస్తు రూమ్? నం. ఎఫ్?-26 జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రాజన్న సిరిసిల్ల కార్యాలయములో సంప్రదించగలరు. తదుపరి పూర్తి చేసిన దరఖాస్తులు తేది.25-03-2026, సాయంత్రం 5.00 గం. లోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రాజన్న సిరిసిల్ల కార్యాలయములో సమర్పించవలయును. ఇట్టి అవకాశమును రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రవైటు ఇ/మీ పాఠశాలలు సద్వినియోగము చేసుకోగలరని తెలియజేయనైనది.

# ఫీజులు కట్టలేదని ఇంటర్ హాల్ టికెట్లు నిలుపుదల చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఫీజులు చెల్లించలేదని కారణం చూపుతూ హాల్ టికెట్లు నిలుపుదల చేయడం విద్యార్థుల హక్కులను హరించడమేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్న కళాశాలలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజినీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు చదువుకునే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, ఫీజుల పేరుతో పరీక్షలకు అనుమతించకుండా అడ్డుకోవడం అన్యాయమని పేర్కొంది. కొందరు కళాశాలలు హాల్ టికెట్లు ఇంటర్నెట్, వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని చెబుతూనే, ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆరోపించింది. పరీక్ష హాల్లో హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామానికి చెందిన దాసరి అజయ్ (19), ఉదయ్‌కిరణ్ (19), అజాన్ ముగ్గురు కలిసి ఆదివారం సాయంత్రం చేవెళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా నాగర్‌గూడ చౌరస్తా వద్ద లారీ కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్, ఉదయ్‌కిరణ్ అక్కడికక్కడే మృతి చెందారు. అజాన్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన అజాన్‌ను తొలుత చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.మృతుడు ఉదయ్‌కిరణ్ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నిరుపేద కుటుంబానికి అండగా కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు

- **వివాహానికి బియ్యం వితరణ**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిక్కులవాడకు చెందిన చందన్ సింగ్ -- జక్తీ దంపతుల కుమార్తె రాజేశ్వరి వివాహం నిశ్చయమైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో, కౌన్సిలర్ కల్లూరి రేణుక-రాజు ఆదివారం నాడు ఆ నిరుపేద కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధువును ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. కౌన్సిలర్ చూపిన ఈ ఉదారతపై వధువు కుటుంబ సభ్యులు మరియు బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ, తమకు అండగా నిలిచినందుకు కౌన్సిలర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరి శేఖర్, గడ్డం వెంకటేష్, కొక్కుల నర్సయ్య, లింగంపెల్లి దేవయ్య, కుల్ల శ్రీనివాస్, కోడూరి మల్లేశం, బింగి శ్రీధర్, బొల్లి అంబదాస్, వెంకటస్వామి గౌడ్ మరియు వధువు తరపు బంధుమిత్రులు పాల్గొన్నారు.



## మండేపల్లిలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం..

- **30 మందికి కంటి పరీక్షలు.. నలుగురికి ఉచిత శస్త్రచికిత్సలు**
- **శ్రీ భవానీ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ సహకారంతో ఏర్పాటు**

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామ రెడ్డి సంఘ భవన కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాదగోని సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి సిరిసిల్లలోని శ్రీ భవానీ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ వారు వైద్య సేవలు అందించారు.

ఈ శిబిరంలో భాగంగా సుమారు 30 మంది గ్రామస్తులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా దగ్గర చూపు, దూరం చూపు, తలనొప్పి మరియు మోతి బిందువు (జఖ్ఖుతీఖవ్) సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి, తగిన మందులను సూచించారు. వీరిలో తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న నలుగురిని గుర్తించి, వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు సర్పంచ్ సాగర్ ఈ సందర్భంగా తెలిపారు. సర్పంచ్ గాదగోని సాగర్ మాట్లాడుతూ.. గ్రామంలోని సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాస సందీప్, అమరాగొండ ప్రభుదాస్, వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వల్లంపట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత.

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

వల్లంపట్ల జిల్లా పరిషత్ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ మ్యాథమెటిక్స్ సాక్షి స్టడీ మెటీరియల్ గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్ గారితో అందించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకొని మండలంలో అత్యధిక మార్కులు పొందాలని సూచించారు. అదేవిధంగా ఎస్ఎస్సి విద్యార్థులు పరీక్షలు రాయడానికి గాలి పెల్లి సెంటర్ కు వెళ్లాల్సి ఉంటుందని వారి కోసం గాను వల్లంపట్ల గ్రామం నుండి బాలికలకు బాలురకు విడివిడిగా మూడు వాహనాలను ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూస గోవర్ధన్, భీముని మల్లారెడ్డి హై స్కూల్ హెచ్ఎం నర్సింగరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి..



**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని అన్నారు.లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు.

## సిరిసిల్లలో వైభవంగా శ్రీ ధర్మశాస్తా మందిర ద్వితీయ కుంబాభిషేక రజతోత్సవాలు

- **హోమ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి దంపతులు**
- **ప్రత్యేక హోమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం (ట్రస్ట్) ఆధ్వర్యంలో శ్రీ ధర్మశాస్త్ర మందిర ద్వితీయ కుంబాభిషేక రజతోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన 'స్థాపిత ప్రతిష్ట మూర్తులకు మూల మంత్రములచే హోమం' కార్యక్రమంలో గౌరవ పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి-చక్రపాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో, కనుల పండుగగా ఈ వేడుకలను నిర్వహిస్తున్న దేవస్థానం ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ హోమంలో పాల్గొనడం తమ అదృష్టమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి వారి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో



వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం మదనానంద పీఠాధిపతులు శ్రీ శ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు సదానంద మాధవార సరస్వతి స్వామి వారు భక్తులకు హితబోధ చేస్తూ అందించిన ప్రవచనాలను చైర్‌పర్సన్ దంపతులు మరియు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలకించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ రాచ విద్యాసాగర్ గురుస్వామి, కౌన్సిలర్ సభ్యులు గెంట్యాల శ్యామల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దిడ్డి రమాదేవి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గడ్డం చందన భగవాన్, గుడిపాటి చంద్రశేఖర శర్మ గురుస్వామి, ఇతర గురుస్వాములు, పుర ప్రముఖులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మూసీ పునరుజ్జీవం పేరుతో వ్యాపారీకరణ చేస్తారా?

- **బఫర్ జోన్ పేరుతో ఇళ్ల తొలగింపులు నిలిపివేయాలి**
- **అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**


హైదరాబాద్, నవతెలంగాణ: మూసీ నది పునరుజ్జీవం పేరుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రక్షాళన కంటే సుందరీకరణ, రియల్ ఎస్టేట్ మరియు టూరిజం వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్టుగా కనిపిస్తున్నాయని అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం (యూడిఎఫ్) విమర్శించింది. బఫర్ జోన్ పేరుతో ఇళ్ల తొలగింపులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది.మూసీ నది మురికి కూపంగా మారిన నేపథ్యంలో దాని శుద్ధి, పర్యావరణ పరిరక్షణతో కూడిన నిజమైన పునరుజ్జీవం జరగాలని హైదరాబాద్ ప్రజలు కోరుకుంటున్నారని యూడిఎఫ్ కన్వీనర్ ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం నది ఇరువైపులా 50 మీటర్ల వరకు "బఫర్ జోన్"గా ప్రకటించి, దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఇళ్లను తొలగించేందుకు సిద్ధపడటం అత్యంత అన్యాయమని అన్నారు.ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు అక్రమంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. బఫర్ జోన్‌లో ఉంటే గతంలో అనుమతులు ఎలా మంజూరు చేశారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాధానం ఇవ్వకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని అభిప్రాయపడ్డారు.

నది ప్రవాహానికి ఆటంకం కలిగించని ఇళ్లను కేవలం సుందరీకరణ కోసం తొలగించడం దుర్మార్గమైన చర్య అని యూడిఎఫ్ పేర్కొంది. వరదలతో ఏనాడూ మునిగిపోని బస్తీలు, కాలనీలను ఇప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. గరిష్ట నది ప్రవాహ మట్టం (ఎంఎఫ్ఎల్) వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేసింది. మూసీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రజల ముందుకు రాకముందే, అసెంబ్లీలో చర్చించకముందే నివాసాల తొలగింపులు ప్రారంభించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొంది. పథకం పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చించి ముందుకు వెళ్తామని ప్రభుత్వం ప్రకటించిన మాట నిలబెట్టుకోవాలని కోరింది."గాంధీ సరోవర్ ప్రాజెక్ట్", "రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్" పేర్లతో పేద ప్రజలను నిరాశ్రయులను చేసి భూములను టూరిజం, ప్రైవేట్ ప్రాజెక్టులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని యూడిఎఫ్ ఆరోపించింది. సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి నమూనాలో వేలాది పేదలను బహిష్కరించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, అదే విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేయడం ప్రజా వ్యతిరేక చర్య అని పేర్కొంది. మూసీ నిజమైన పునరుజ్జీవం అంటే నది శుద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన హక్కుల రక్షణ అని స్పష్టం చేసింది. మూసీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన పూర్తి డీపీఆర్, ఎంఎఫ్ఎల్ వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని, పరిసర ప్రాంతాల ప్రజలతో విస్తృత చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. నది ప్రవాహానికి ఆటంకం కలిగించని ఇళ్లను తాకకుండా అభివృద్ధి పనులు చేపట్టి, మురుగునీరు మూసీలో కలవకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని యూడిఎఫ్ కోరింది.

## ది ప్యారడైజ్' ఫస్ట్ సింగిల్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

- నాని పుట్టినరోజున 'ఆయా షేర్' రిలీజ్...

బలగం టీవీ, హైదరాబాద్




నేచురల్ స్టార్ నాని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలకు రంగం సిద్ధమైంది. నాని పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 24న(నేడు) 'ఆయా షేర్' అనే టైటిల్‌తో తొలి పాటను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన ప్రోమోకు సోషల్ మీడియాలో విశేష స్పందన లభిస్తోంది. ఇందులో నాని ఎనర్జీ అభిమానులను ఆకట్టుకుంటోంది. 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల-- నాని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రెండో చిత్రం ఇదే. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా షఉటింగ్ శరవేగంగా సాగుతోంది.'ఆయా షేర్' పాటను వందలాది డ్యాన్సర్లతో రామోజీ ఫిలిం సిటీలో భారీ స్థాయిలో చిత్రీకరించినట్లు యూనిట్ వెల్లడించింది. ఈ సాంగ్‌లో నాని మాస్ అవతార్‌లో కనిపించనున్నారని, అభిమానులకు ప్రత్యేక ట్రీట్‌గా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ బాణీలు అందించగా, సుందర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు.మొదట మార్చి 26న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని వాయిదా వేసి, ఇప్పుడు ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్షలు

### సిరిసిల్లలో 20 రోజుల్లో 364 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షలు, జరిమానాలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు.

గత 20 రోజులలో సిరిసిల్ల సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 364 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకొని, వాటి రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మద్యం సేవించి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ తనిఖీల్లో పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్ల జారీపై తక్షణ చర్యలు తీసుకోవాలి

### పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని కంచర్ల రవి గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు పూర్తిగా చెల్లించిన తర్వాతే హాల్ టికెట్ ఇస్తామని చెప్పి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. పరీక్షలు దగ్గరపడుతున్న ఈ కీలక సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. హాల్ టికెట్ ఇవ్వకుండా పరీక్షలకు దూరం చేయడం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ప్రతి విద్యార్థికి హక్కు అని, ఫీజుల పేరుతో అడ్డంకులు సృష్టించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంబంధిత కళాశాలలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుని ఎలాంటి షరతులు లేకుండా అన్ని ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు అందేలా చూడాలని జిల్లా అధికారులను కోరారు.

అలాగే, పరీక్ష కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తాగునీరు, విశాల గదులు, ఫ్యాన్లు, సరైన కూర్చోవడానికి సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల కోసం వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. అప్రోచ్, వడ్లూరి వేణు, మారం కార్తికేయ, నరేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## జింబాబ్వేపై వెస్టిండీస్ సూపర్ విక్టరీ

- 107 పరుగుల తేడాతో విజయం
- హెట్మెయర్ మెరుపు అర్ధశతకం... పావెల్ దూకుడు ఇన్నింగ్స్...



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

జింబాబ్వే జట్టుపై వెస్టిండీస్ సూపర్ గెలుపు సాధించింది. ఈ ప్రపంచకప్‌లోనే అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచేలా 107 పరుగుల తేడాతో గెలిచి తన సత్తాను చాటుకుంది.

**హెట్మెయర్ -- పావెల్ పరుగుల వర్షం**

టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ప్రారంభంలో వెస్టిండీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (9), కెప్టెన్ షాయ్ హోప్ (14) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షిమ్రాన్ హెట్మెయర్, రోవ్‌మన్ పావెల్ జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడి ప్రారంభించారు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 122 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ దిశను పూర్తిగా మార్చేశారు. హెట్మెయర్ కేవలం 19 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. మొత్తం 34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 85 పరుగులు చేసి ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచాడు. పావెల్ 35 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు.చివర్లో రూథర్‌ఫోర్డ్ (13 బంతుల్లో 31 నాటౌట్), రోమారియో షెపర్డ్ (21) మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టును 6 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరుకు చేర్చారు.

**చేతులెత్తేసిన జింబాబ్వే**

255 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ఏ దశలోనూ పోటీ ఇవ్వలేక పోయింది. విండీస్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 147 పరుగులకే ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. విండీస్ స్పిన్నర్ గుడాకేష్ మోతీ అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు.

## ఉగ్రవాదానికి చెక్ పెట్టే 'ప్రహార్'

(మొదటి పేజీ తరువాయి)

కారణంతోనైనా పూర్తిగా ఖండిస్తుంది" అని స్పష్టం చేసింది.

**ఇంటెలిజెన్స్ సమన్వయం -- కేంద్ర బిందువులు**

ఉగ్రదాడుల నివారణలో ఇంటెలిజెన్స్ సేకరణ, సమాచార మార్పిడికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇందుకోసం మల్టీ-ఏజెన్సీ సెంటర్, అలాగే క్ష్మ్రత్వశ్రీశ్రీఅస్త్రవఅఎవ దీబతీముబ ఆధ్వర్యంలోని జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను కీలక వేదికలుగా గుర్తించారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సమన్వయ చర్యలకు ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు అమలులో ఉంటాయని తెలిపారు.

**డీ-రాడికలైజేషన్ -- యువతపై ప్రత్యేక దృష్టి**

యువతను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద రిక్రూట్‌మెంట్ ప్రయత్నాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పాలసీ వెల్లడించింది. గుర్తించిన యువతపై దశలవారీ పోలీస్ స్పందన ఉంటుందని, వారి రాడికలైజేషన్ స్థాయిని బట్టి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. కమ్యూనిటీ, మతపరమైన నాయకులు, ఎన్‌జీఓలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

**అంతర్జాతీయ సహకారం కీలకం**

ఉగ్రవాద సంస్థల గుర్తింపు, నిషేధం, పరారీలో ఉన్న నిందితుల అప్పగింతల్లో ద్వైపాక్షిక, బహుపాక్షిక సహకారం ఫలితాలు ఇచ్చిందని డాక్యుమెంట్ పేర్కొంది. దేశీయ చర్యలకు తోడుగా ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారం ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కీలకమని స్పష్టం చేసింది.దేశ భద్రతను సమగ్రంగా బలోపేతం చేసే దిశగా 'ప్రహార్' పాలసీ ఒక కీలక మైలురాయిగా కేంద్ర ప్రభుత్వం అభివర్ణిస్తోంది.

## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నియమించారు. జిల్లా సమన్వయ కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన రవాణా సదుపాయాల ఏర్పాట్లు, పరీక్షల సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ ఎయిడ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. దాదాపు 7,500 సీసీ కెమెరాల ద్వారా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

పరీక్షల నిర్వహణలో భాగంగా స్టేట్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. టెలిఫోన్ నెంబర్ 040-2465 5027 లేదా 9402 05555లలో సంప్రదించవచ్చు. అదే విధంగా పరీక్షల్లో విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు నిరంతరాయంగా నిపుణులైన కౌన్సిలర్లు, ఉచిత మానసిక ఆరోగ్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు అవసరమైతే టోల్ ఫ్రీ నెంబర్ 14416, లేదా 80693 91416లో సంప్రదించొచ్చు.

పరీక్షా సమయం ప్రారంభం కావడానికి అరగంట ముందే వెళ్లేలా విద్యార్థులు సిద్ధపడితే మంచిదని కృష్ణ ఆదిత్య సూచించారు. తద్వారా పరీక్షలను మరింత ఫోకస్‌గా రాసేందుకు వీలుంటుందన్నారు. ట్రాఫిక్ జాంలు, ఇతర సమస్యల బారిన పడకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జోన్ ఆధారంగా జంబ్లింగ్ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఐదు సెంటర్లకు సంబంధించిన విషయం మాల్ ప్రాక్టీస్ కమిటీ వద్ద విచారణలో ఉందని చెప్పారు.

## ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాస్పద లబ్ధిదారుల ఖాతాలను గుర్తించి, నిధుల రీకాల్ కోసం ఇతర బ్యాంకులకు విజ్ఞప్తులు పంపినట్లు బ్యాంకు వెల్లడించింది. ఫిబ్రవరి 22న అధికారిక ప్రకటన విడుదల చేసి, మోసం చండీగఢ్ బ్రాంచ్‌లోని హర్యానా ప్రభుత్వ ఖాతాలకు మాత్రమే పరిమితమై ఉందని తెలిపింది. పూర్తి దర్యాప్తు అనంతరం ఖచ్చితమైన నష్టం వివరాలు వెల్లడిస్తామని పేర్కొంది.

**ఆర్బీఐకి నివేదిక -- పోలీసులకు ఫిర్యాదు**

ఈ ఘటనపై ఆర్బీఐకి నివేదిక సమర్పించినట్లు బ్యాంకు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కూడా సమాచారం అందజేసింది. మోసంలో ఇతర వ్యక్తుల ప్రమేయం కూడా ఉన్న అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు సుమారు 20 శాతం పతనమయ్యాయి. మరోవైపు హర్యానా ప్రభుత్వం కూడా సీరియస్‌గా స్పందించి, ఆ బ్యాంకుతో అన్ని లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఈ ఘటన




దేశవ్యాప్తంగా ఆర్థిక రంగంలో సంచలనం సృష్టించగా, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలువడే అవకాశముంది.